ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

కర్ణాటక వార్తలు

సోమవారం 4 ఆగస్టు 2025



జేపీ నడ్డాతో నాయకుల చర్చలు

జేపీ నడ్డాకు ఘన స్వాగతం

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బెంగళూరు విమానాశ్రయంలో రాష్ట్ర నేతలు ఆదివారం ఘన స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్, ఎంపీ పీసీ మోహన్, ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. కాసేపు తాజా రాజకీయాలపై చర్చలు జరిపారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు

- రాష్ట్రంలో పెరుగుతున్న కళాశాలలు
- 6వేలకు పైగా భర్తీకాని సీట్లు
- విద్యార్థుల్లో తగ్గుతున్న ఆసక్తి

ఆదరణ కరువు..!

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాల క్రితం సమాజంలో పాలిటెక్నిక్ కోర్సు అంటే ఎంతో డిమాండ్ ఉండేది. అప్పట్లో ఇంజనీరింగ్ కళాశాలలు జిల్లాకు ఒకటి చొప్పున కూడా ఉండేవి కావు. ఉన్నత విద్యాసంస్థలు తక్కువగా ఉన్న తరుణంలో పదో తరగతి ముగియగానే పాలిటెక్నిక్‌లో చేరి ఏదో ఒక నైపుణ్య శిక్షణ పొంది ఉపాధి లేదా ఉన్నత చదువుకు వెళ్లాలని భావించేవారు. ఇలా ఐటీఐ, పాలిటెక్నిక్‌లకు భారీ డిమాండ్ ఉండేది. ఆ తర్వాత ఇంజనీరింగ్ కళాశాలల ప్రారంభం పెరిగింది. ఒకప్పుడు జిల్లాకు ఒకటి కూడా లేని ఇంజనీరింగ్ కళాశాల ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో వెలిశాయి. దీంతో పాలిటెక్నిక్ కోర్సులలో చేరేవారిసంఖ్య తగ్గుతూ వచ్చింది.



శేషాద్రి రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల



వైట్‌ఫీల్డ్‌లోని పాలిటెక్నిక్ కళాశాల

- ఏటా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు పెరుగుతున్నాయిగానీ విద్యార్థుల సంఖ్య మాత్రం తగ్గుముఖం పడుతోంది. 2025-26 విద్యాసంవత్సరంలో 109 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 27వేలకుపైగా సీట్లు ఉండగా, ప్రస్తుతం భర్తీ అయ్యింది 20,400 మాత్రమే. గడిచిన ఐదారేళ్లుగా పాలిటెక్నిక్ కళాశాలల్లో వేలకొలదీ సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థులు చేరేందుకు వెనుకడుగు వేస్తున్నారు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, అధ్యాపకుల కొరత ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. 2025 బడ్జెట్‌లో 27 పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించారు. ఆ నిధులతో అత్యవసరమైన పనులు చేపట్టదలిచారు. మరోవైపు ప్రతి పాలిటెక్నిక్ కళాశాలకు తగిన ల్యాబ్‌లు కీలకమైనవి. పలు కళాశాలల్లో ల్యాబ్‌లు పూర్తిస్థాయిలో లేకపోవడం, వాటిని ఆధునీకరించకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి.
- ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశానికి పీయూ తర్వాత సీఈటీ ద్వారా చేరేందుకు వీలుంది. ఎక్కువమంది విద్యార్థులు పీయూసీలో సైన్స్ కోర్సులలో చేరి సీఈటీ ద్వారా ఇంజనీరింగ్‌లో చేరేందుకు ఇష్టపడరు. ఇలాంటివారు పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశించి ఆ తర్వాత లేటరల్ ఎంట్రీ ద్వారా డీసీఈటీ రూపంలో ప్రవేశం పొందుతారు. అయినా పాలిటెక్నిక్ కోర్సులకు డిమాండ్ తగ్గుతోందని సాంకేతిక విద్యావిభాగం అభిప్రాయపడుతోంది.
- ప్రతి ఏటా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల సంఖ్య పెరుగుతోంది. 2022-23లో 101 పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా 23,918 సీట్లు ఉండేవి. 2023-24లో కళాశాలల సంఖ్య 105కు చేరగా 24,272 సీట్లకు పెరిగాయి. 2024-25లో 107 కళాశాలలు కాగా 26,360 సీట్లకు పెరిగాయి. ఏటా 26వేల మంది విద్యార్థులు పాలిటెక్నిక్ ద్వారా ప్రవేశానికి అవకాశం ఉంది. కళాశాలల సంఖ్య పెరుగుతుండడం, మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు ఉండే పలు కళాశాలల్లో ఇన్‌టేక్‌ను పెంచుకునే ప్రయత్నం జరుగుతోంది. ఇలా ఏటా 2వేలసీట్లు పెరుగుతున్నాయి. అయితే అన్ని సీట్లు భర్తీ కావడం లేదు. కొన్ని జిల్లాల కళాశాలల్లో కొన్ని కోర్సులకు డిమాండ్ ఉంది. వాటికి అనుగుణంగా ఉన్నత విద్యాశాఖ పాలిటెక్నిక్ కళాశాలసంఖ్యను పెంచుతోంది. పాలిటెక్నిక్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థినులు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో కళాశాలల్లో బాలికల సంఖ్య బాలురతో పోలిస్తే చాలా వ్యత్యాసం ఉంది. 16వేలమంది విద్యార్థులు ప్రవేశం పొందితే అందులో 6వేలమంది మాత్రమే బాలికలు ఉన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో 14,653మంది బాలురు కాగా 5458మంది బాలికలు అడ్మిషన్లు పొందారు. 2023-24లో 16,318మంది బాలురు కాగా 6422మంది బాలికలు ప్రవేశం పొందారు.
- గ్రామీణ ప్రాంతాలలో పాలిటెక్నిక్ కళాశాలలు దూరంగా ఉండడం, మూడు సంవత్సరాల కోర్సులో ఎక్కువ సమయం ల్యాబ్‌లలోనే గడపాల్సి ఉండడం కష్టంగా భావిస్తున్న విద్యార్థులు పాలిటెక్నిక్‌లో చేరేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇంజనీరింగ్‌లో చేరదలచుకున్నవారు పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక కోర్సులు పూర్తి చేసి నేరుగా ఇంజనీరింగ్‌లో ప్రవేశిస్తారు. పాలిటెక్నిక్‌లో డిప్లమో ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు, పారా మెడికల్ అండ్ హెల్త్‌కేర్, ఫార్మసీ, ఐటీ డిజిటల్ మార్కెటింగ్, అగ్రికల్చర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ తదితర కోర్సులు ఉన్నాయి.

ఆకలి రహిత రాష్ట్రానికి కట్టుబడ్డాం

- మంత్రి మునియప్ప



ఇందిరా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో మంత్రి, నాయకులు

విజయపుర, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఆకలి రహితగా మార్చేలా ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన పథకాలలో ఇందిరా క్యాంటీన్ కీలకమైనదని పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కేహెచ్ మునియప్ప అన్నారు. ఇందిరాక్యాంటీన్ ద్వారా పేదలు, కార్మికవర్గాలు తదితరులకు ఎంతో అనుకూలంగా ఉందన్నారు. స్థానిక అంకతట్టి నంజుండప్ప సర్కిల్‌లో నిర్మించిన ఇందిరాక్యాంటీన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరాక్యాంటీన్ ద్వారా తక్కువ ధరతో నాణ్యమైన ఆహారం అందుతోందని తద్వారా సామాన్యులకు ఆర్థికభారం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షులు భవ్యమహేశ్, మాజీ అధ్యక్షులు ఎం సతీశ్‌కుమార్, కేపీసీసీ కార్యదర్శి మంజునాథ్, విజయపుర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దిన్నూరు వెంకటేశ్ పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన



సేకరించిన ఈ-వ్యర్థాలతో చిన్నారులు

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): సాధారణ వ్యర్థాలకంటే సమాజంలో ఈ-వ్యర్థాల ప్రభావం పెరుగుతోందని వాటిని సంస్కరించి, కాలుష్య నియంత్రణ జరిపేలా బెంగళూరు ఇంటర్నేషనల్ అకాడమీ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. శనివారం పాఠశాల ప్రాంగణంలో మినీ లీడర్స్ విత్ ఏ మెగా అనే నినాదంతో చిన్నారుల ద్వారా ఎన్ గ్రీన్ టెక్ పేరిట విద్యార్థుల నేతృత్వంలోనే ఈ-వ్యర్థాల సేకరణ చేపట్టారు. ఎన్ గ్రీన్‌టెక్ ఫౌండర్ పదేళ్ల నయన్ ఆదిత్య మాట్లాడుతూ బెంగళూరుతో పాటు దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణకు తమవంతు ఉద్యమంగా ఈ-వ్యర్థాలను సేకరించే లక్ష్యం పెట్టుకున్నామన్నారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ మునిరాజు మాట్లాడుతూ ఎన్ గ్రీన్‌టెక్ భాగస్వామ్యంతో మా సంస్థలో చిన్నారుల మనసులో వ్యర్థాల పరిష్కరణ, సంస్కరణ కార్యరూపం చేయదలిచామన్నారు. 1 నుంచి 12వ తరగతులకు చెందిన 200మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. 100కేజీల ఈ-వ్యర్థాలను 300 ఇళ్ల నుంచి సేకరించినట్లు తెలిపారు.

దర్శన్ తరహాలో నాకూ బెయిల్ ఇవ్వండి

- కోర్టుకు విన్నవించిన నేహా హత్య కేసు నిందితుడు

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడు నటుడు దర్శన్‌కు బెయిల్ ఇచ్చినట్టే... నాకు బెయిల్ మంజూరు చేయాలని హుబ్బళ్లిలోని ఒకటో జిల్లా సెషన్స్ కోర్టును ఫయాజ్ కోరారు. హుబ్బళ్ళిలో విద్యార్థిని నేహా ప్రేమించలేదని, కళాశాల ప్రాంగణంలోనే దారుణంగా హత్య చేసిన ఫయాజ్ జైలులో విచారణ ఖైదీగా ఉన్నారు. గత ఏడాది ఏప్రిల్ 18న నేహా హిరేమఠ్‌ను దారుణంగా హతమార్చిన సంగతి తెలిసిందే. చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడు దర్శన్‌కు బెయిల్ మంజూరు చేసినట్టే తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఫయాజ్ తరఫు న్యాయవాదులు పటిషన్‌ను ఇటీవల దాఖలు చేశారు. సోమవారం పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఇదే విషయమై నేహా తండ్రి హిరేమఠ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంచి కోసం ఇతరులను ఆదర్శంగా తీసుకోవాలని, కిరాతకంగా వ్యవహరించి సాకులు కోరడం సరికాదని మండిపడ్డారు.

దుబాయ్‌లో జోయ్ అలుక్కాస్ 50 కోట్ల పెట్టుబడి



ఒప్పందంలో ఇరుసంస్థల ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా జోయ్ అలుక్కాస్ సంస్థ దుబాయ్‌లో రూ.50కోట్ల పెట్టుబడికి ఒప్పందం చేసుకుంది. ఇటీవల దుబాయ్‌లో సంస్థ చైర్మన్ జోయ్ అలుక్కాస్, ఎన్‌బీడీ హోల్‌సేల్ బ్యాంకింగ్ ఎమిరేట్స్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు బెంగళూరులో జోయ్‌లుక్కాస్ ప్రతినిధులు ప్రకటన విడుదల చేశారు. జోయ్‌లుక్కాస్ చైర్మన్ ఎండీ జోయ్ అలుక్కాస్ అభిప్రాయం మేరకు యూకే, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా సహా కీలకమైన అంతర్జాతీయ మార్కెట్‌లో సంస్థను విస్తరింప చేయదలిచామన్నారు. ఎన్‌బీడీ హోల్‌సేల్ బ్యాంకింగ్ గ్రూప్ హెడ్ అహ్మద్ ఏఐ కసీం అభిప్రాయం మేరకు జోయ్ అలుక్కాస్ పెట్టుబడి సదుపాయంతో ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

ఆరోగ్య బీమా కంపెనీలు వేగవంతంగా

బిల్లులు చెల్లించాలి



సీఐఐ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యబీమా కంపెనీలు వేగవంతంగా బిల్లులు చెల్లించాలని, ఆరోగ్య సమస్యలు బీమా పరిధికి తీసుకురావాలని భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య హెల్త్ టాస్క్‌ఫోర్స్ ముఖ్యులు డాక్టర్ చంద్రకుమార్ అన్నారు. సీఐఐ దక్షిణ విభాగం ఆరోగ్య రంగానికి సంబంధించి నగరంలో ఆరోగ్యబీమా సమ్మేళనం పేరిట చర్చాగోష్టి నిర్వహించారు. కావేరి గ్రూప్ ఆసుపత్రుల ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఆరోగ్య బీమా వ్యవస్థలో మరిన్ని మార్పులు రావాల్సి ఉందన్నారు. పాలసీ మేకర్స్ మార్గదర్శకాలు రూపొందించే వేళ బీమా సంస్థలతోపాటు రోగులకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వివిధ ఆసుపత్రులు, బీమా సంస్థల ప్రతినిధులు 150మందికిపైగా పాల్గొన్నారు.

పోటా పోటీ ఆందోళనలు

రాహుల్ నిరసన వేళ... బీజేపీ ఆందోళన



బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ ఓట్ల చౌర్యం జరిగిందనే ఆరోపణలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసనకు సిద్ధమయ్యారు. మూడు రోజులుగా ఫ్రీడంపార్కులో ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇదే రోజున రాష్ట్ర ప్రభుత్వం పలు అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్‌ను తిప్పికొట్టేలా బీజేపీ ఆందోళనకు సిద్ధమైంది. ఢిల్లీలో ఇటీవల రాహుల్‌గాంధీ ఓట్ల చౌర్యంకు సంబంధించి బీజేపీ, ఎన్నికల కమిషన్‌పై తీవ్రమైన ఆరోపణలు చేశారు. కర్ణాటకలో ఒక నియోజకవర్గంలో చౌర్యంకు సంబంధించి సమగ్ర ఆధారాలు ఉన్నాయని ఆరోపించారు. తాజాగా బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలో మోసం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగానే 5న కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టదలిచారు. తొలుత మహదేవపుర నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం దాకా పాదయాత్ర చేయాలని భావించారు. నగరంలో ట్రాఫిక్‌తోపాటు పలు సమస్యలు ఎదురవుతాయని చివరకు ఫ్రీడంపార్కులో నిరసన చేపట్టదలిచారు. ఎన్నికలలో వైఫల్యాలు, కేంద్రప్రభుత్వానికి వ్యతిరేకంగా చార్జ్‌షీట్ పేరిట నిరసన చేపడుతున్నారు. రాహుల్‌గాంధీతోపాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలువురు జాతీయ నాయకులు పాల్గొననున్నారు. బెంగళూరుతోపాటు 11 జిల్లాల పార్టీ కార్యకర్తలను నిరసనలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌లు పర్యవేక్షిస్తున్నారు. రాహుల్‌గాంధీ మంగళవారం ఉదయం 11 గంటలకు హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడనుంచి ఫ్రీడంపార్క్‌కు వస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఎన్నికల కమిషన్ కార్యాలయం దాకా పాదయాత్రగా వెళ్లి వినతిపత్రం ఇవ్వనున్నారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ రూపొందిస్తున్న పోరాటానికి బెంగళూరులో శ్రీకారం చుట్టడం ద్వారా దేశవ్యాప్తంగా విస్తరింపచేసేందుకు ఇదో భారీ శక్తి ప్రదర్శన కావాలని పార్టీ నిర్ణయించింది. శనివారం మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రముఖ నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బెంగళూరు మినహాయించి ప్రతి జిల్లా నుంచి కనీసం 5వేలమందిని తీసుకురాదలిచారు. అందుకు భారీగా బస్సులను సిద్ధం చేయాలని తీర్మానించారు.

- ఇక బీజేపీ కూడా అదే రోజున మంగళవారం రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ నిరసన చేపట్టదలిచింది. విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద వారు ఆందోళన చేయదలిచారు. లోక్‌సభ ఎన్నికల వేళ వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ గ్రాంట్లను ఇష్టారాజ్యంగా ఖాతాలకు మళ్లించి ఎన్నికలకు ఖర్చు చేశారనే విషయాన్ని ప్రస్తావించదలిచారు. రాష్ట్రప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టదలిచారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు పలువురు పాల్గొననున్నారు.

కేఆర్ఎస్ డ్యాంకు టిప్పుసుల్తాన్ పునాది

- మంత్రి మహదేవప్ప వివాదాస్పద వ్యాఖ్య

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మైసూరు రాజు నాల్వడి కృష్ణరాజ్ ఒడయార్ కంటే సీఎం సిద్దరామయ్య ఎక్కువ అభివృద్ధి చేశారంటూ ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా మంత్రి మహదేవప్ప మరో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. టిప్పు సుల్తాన్‌ను పొగడడంలో భాగంగా మైసూరు రాజుల సాధనను తక్కువ చేసేలా చేశారు. ఆదివారం మండ్యలో మంత్రి మాట్లాడుతూ కేఆర్ఎస్ డ్యాంకు పునాది వేసింది టిప్పుయే అన్నారు. ఇందుకు సంబంధించి కేఆర్ఎస్ గేట్ ప్రవేశద్వారం వద్ద సాక్ష్యం ఉందన్నారు. అయితే దీన్ని ఎవరూ ధైర్యంగా చెప్పడం లేదన్నారు.

ఎంపీ యదువీర్ అభ్యంతరం: మంత్రి మహదేవప్ప చేసిన వ్యాఖ్యలను మైసూరు ఎంపీ, యువరాజు యదువీర్ తిప్పికొట్టారు. కేవలం రాజకీయ ఉద్దేశాల కోసం ఇలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీ చరిత్రను వక్రీకరించేలా చేస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇదే తరహాలో వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ నాయకులు రాజకీయాలు చేసుకోవాలని, చరిత్ర గురించి తప్పుగా మాట్లాడరాదన్నారు. చరిత్రకు సంబంధించి నిపుణులు ఉన్నారని ఈ అంశంపై సమీక్ష చేయాలన్నారు.

కళలను ప్రోత్సహించాలి

- బళ్లారి రాఘవ ఏపీ రాష్ట్ర పురస్కార గ్రహీత గోపాలకృష్ణ



బళ్లారి రాఘవ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

6

ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలం

- బీసీఆర్ఎస్ బృందం అధ్యక్షుడు సోమనాథ్



పరుగులో పాల్గొన్న ప్రజలు

వైట్‌ఫీల్డ్‌లో ఉత్సాహంగా

పరుగు

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): శాప్ ల్యాబ్స్ ఇండియా రెండో విడత ఆదివారం ఏర్పాటు చేసిన రన్ ఉత్సాహంగా సాగింది. ప్రముఖ దక్షిణాఫ్రికా క్రికెటర్ జాంటీరోడ్స్ జెండా ఊపి పరుగును ప్రారంభించారు. ఆర్‌జే పృథ్వీతోపాటు పలువురు ప్రముఖులు భాగస్వాములయ్యారు. శాప్‌ల్యాబ్స్ ఇండియా ఎండీ, సాస్కాం చైర్మన్ సింధు గంగాధరన్ మాట్లాడుతూ సమాజంలో ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించాలని పరుగు ఏర్పాటు చేశామన్నారు. 9వేలమంది భాగస్వాములయ్యారని, మణిపాల్ హాస్పిటల్‌తోపాటు పలు బ్యాంకింగ్‌రంగ సంస్థలు సహకారం అందించాయన్నారు. 10కే, 5కే, 3కే రన్ పోటీలు జరిపామన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.80	1631.72
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1,01,537	1,31,821
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	94,488	93,684
నీటి నిల్వ (టీఎంసీలు)	75.84	100.64

నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఉపాధ్యాయులకు కిట్లను అందజేస్తున్న విమ్స్ డైరెక్టర్ గంగాధర్ గౌడ

బళ్లారి సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నోటిని పరిశుభ్రం గా ఉంచుకోవాలని విమ్స్ డైరెక్టర్ గంగాధర్ గౌడ అ న్నారు. బీఎంసీఆర్ ప్రభుత్వ దంత కళాశాల, పరిశోధనా సంస్థ గమ్ డిసీజ్ విభాగం ఆధ్వర్యంలో నగరంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో నోటి పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విమ్స్ డైరెక్టర్ ప్రసంగించారు. నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులకు నోటి పరిశుభ్రత కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భారతి, డీడీపీ ఉమాదేవి, బీఈఓ సిద్దలింగమూర్తి పాల్గొన్నారు.

ఏపీఎంసీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



ఏపీఎంసీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న హసిరు సేన రైతు సంఘం నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): రైతులను మోసం చేస్తున్న ఏపీఎంసీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, హసిరుసేన, బళ్లారి రైతు సంఘం ఆధ్వర్యంలో ఏపీఎంసీ కార్యదర్శికి విన్నవించారు. హసిరుసేన జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ జనవరిలో ఆంధ్రా రైతులకు రూ.5వేలు టెండరు వేసి రూ.4 వేలు చెల్లించామని చెప్తారన్నారు. వీరు రైతులను మోసం చేస్తున్నారని వ్యాపారులు, బ్రోకర్లు మూడు రోజులుగా ఏపీఎంసీ మూసేశారని అపద్ధాలు ఆడుతున్నారన్నారు. వీరిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కర్ణాటక ప్రావిన్స్ రైతు సంఘం నాయకులు శివశంకర్, మారన్న, ఎర్రిస్వామి రైతులు ఉన్నారు.

20 మందిపై కేసు

గుత్తి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావా దేవీల వ్యవహారంలో దస్తగిరి అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణ శివారులోని జెడ్ వీరారెడ్డి కాలనీలో నివాసం ఉన్న దూదేకుల దస్తగిరి ఇంటిపై దాడికి పాల్పడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన ఉప్పర సుబ్బయ్య అనే వ్యక్తి వద్ద గుత్తి పట్టణానికి చెందిన దస్తగిరి రూ.37.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అనంతరం సుబ్బయ్యకు తన ఇంటితో పాటు ఖాళీ స్థలాన్ని రిజిస్టర్ చేయించాడు. మూడు సంవత్సరాలలోపు అప్పు తీర్చని పక్షంలో తన ఆస్తిని స్వాధీన పరుచుకోవాలని అగ్రిమెంటు రాయించుకున్నారు. ఈ విషయమై గత నాలుగు నెలలుగా ఇల్లు తమకు స్వాధీన పరచాలని పలుమార్లు చెప్పారు. పట్టించుకోకపోవటంతో దస్తగిరిపై దాడికి పాల్పడ్డారని సీఐ తెలిపారు. దస్తగిరి ఫిర్యాదు మేరకు తొండపాడుకు చెందిన ఓంప్రకాష్, శ్రీపురానికి చెందిన శివ, జక్కలచెరువుకు చెందిన సూర్యప్రతాప్, కొంగనపల్లి గోవర్ధన్, గోవిందు, గౌరీ శంకర్‌తో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఎలక్ట్రికల్ రీవైండింగ్‌లో హౌస్‌వైరింగ్, మోటార్ రీవైండింగ్‌లో స్వయం ఉపాధి కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీసెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. అధిక నాణ్యతగల సాంకేతికత, సౌకర్యాలతో హౌసింగ్ వైరింగ్, ఎలక్ట్రికల్ నిర్వహణ, ఎలక్ట్రికల్ పరికరాల రిపేరీలు, ఫ్యాన్ల రిపేరీ, మోటార్ రీవైండింగ్‌లలో నాణ్యమైన శిక్షణ 45 రోజుల పాటు ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9704407134, 7780752418లను సంప్రదించాలని పేర్కొన్నారు.





బళ్లారి రాఘవ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కళాకారులు, ఛత్రపతి శివాజీ నాటక ప్రదర్శన

కళలను ప్రోత్సహించాలి

- బళ్లారి రాఘవ ఏపీ రాష్ట్ర పురస్కార గ్రహీత గోపాలకృష్ణ
- ముగిసిన రాఘవ జయంత్యుత్సవాలు

బళ్లారి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కళలు, కళాకారులను ప్రోత్సహించినప్పుడే నాటకరంగానికి మనుగడ సాధ్యమవుతుందని బళ్లారి రాఘవ రాష్ట్ర పురస్కార గ్రహీత గోపాలకృష్ణ అన్నారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న బళ్లారి రాఘవ 145వ జయంత్యుత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విజ్ఞాన యుగంలో నాటకాలు కనుమరుగు కావడంతో పాటు నాటక కళనే నమ్ముకున్న ఎంతో మంది కళకారులు మనుగడ కష్టమవుతున్న తరుణంలో కళాసేవకులను గుర్తు చేసుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణమని ఆయన అన్నారు. కార్యక్రమాలకు బళ్లారి నగరంలోని రాఘవ కళామందిరం వేదిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. నాటక కళారంగానికి విశేష సేవలు అందించిన మహానుభావుల జయంతి ఉత్సవాలు ఏటా నిర్వహించడం ద్వారా వారికి గౌరవం అందినట్లు అవుతుందని, అయితే ఉత్సవాలతో నిర్వహించడంతో పాటు మరుగున పడిపోతున్న కళలను, కళాకారులను పోషించినపుడే ఇలాంటి ఉత్సవాలకు సార్థకత ఉంటుందన్నారు. ఇదే సందర్భంలో గుమ్మడి గోపాల కృష్ణను బళ్లారి రాఘవ మెమోరియల్ అసోసియేషన్ సభ్యులు సత్కరించి సన్మానించారు. అనంతరం శ్రీరామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి, విజయవాడ బృందం వారిచే నిర్వహించిన జయహో ఛత్రపతి శివాజి మహారాజ్ చారిత్రక తెలుగు నాటకం సభికులను అలరించింది.

ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలం



మారథాన్‌లో పాల్గొన్న రన్నర్లు



బహుమతులు అందుకుంటున్న దృశ్యం

- బీసీఆర్ఎస్ బృందం అధ్యక్షుడు సోమనాథ్
- ఉత్సాహంగా జిందాల్ స్టీల్ సిటీ రన్-2025

బళ్లారి సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించగలరని బీసీఆర్ఎస్ బృందం అధ్యక్షుడు డాక్టర్ సోమనాథ్ అన్నారు. నగరంలోని విజడమ్ ల్యాండ్ స్కూల్ ప్రాంగణంలో బీసీఆర్ఎస్ బృందం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సిటీ రన్ 2025 ఆదివారం ఉదయం జిందాల్ కంపెనీ సీఈఓ మురగన్ జెండా ఊపి ప్రారంభించారు. మారథాన్‌లో 14రాష్ట్రాలు, స్థానికులు మొత్తం 4వేల మంది రన్నర్లు పాల్గొన్నారు. 3, 5, 10 కి.మీ రేసుల్లో రన్నర్లు పాల్గొన్నారు. ఆరోగ్యం ఒక వరం అనే నినాదంతో 4 సంవత్సరాల క్రితం కీ మారథాన్‌ను ప్రారంభించిన బీసీఆర్ఎస్ నేడు నాల్గవ వార్షికోత్సవాన్ని జరుపుకొంటుంది. పౌరుల ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ శరీరాలపై ప్రతిరోజు పని చేయాలని వక్తలు అన్నారు. దీని ద్వారా తమ శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వారు వివిధ వయస్సుల విభాగాల్లో మొదటి, రెండు, మూడో స్థానాలు పొందారు. బళ్లారి నగరానికిచెందిన రన్నర్లు నాలుగు, ఐదో స్థానాలు పొందిన మహిళలు , పురుషులకు విడివిడిగా నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పాల్గొన్న అభ్యర్థులందరికీ పతకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ముల్లంగి నందీశ్, సీఐ సుభాష్, పీఎస్ఐ కళింగ, 10 కి.మీ పందెంలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు జమకాని బిల్లులు

రెండు నెలలైనా అందని డబ్బు

కుటుంబ పోషణ భారమంటున్న కూలీలు

వెంటనే చెల్లించాలంటూ వేడుకోలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మడకశిర, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసి పది వారాలు పైబడుతున్నా కూలీల ఖాతాలోకి నేటికీ బిల్లులు జమకాకపోవడంతో వారు ఆవేదన చెందుతున్నారు. అప్పులు చేసి జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. పనిచేసినా డబ్బు కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తిందని చెబుతున్నారు. మే 29 వరకు కూలీలకు డబ్బులు ఖాతాలలోకి జమ అయ్యాయి. ఆ తరువాత జమకాలేదు. దీంతో తాము ఎలా కుటుంబాలను పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు రూ. 78 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో రెండు లక్షల మందికి పైగా జాబ్‌కార్డులు ఉన్నాయి. అందులో 1.23 లక్షల జాబ్‌కార్డులకు సంబంధించి కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు. జూన్ 15వ తేదీ వరకు ఉపాధి పనులకు కూలీలు 50వేల నుంచి 70 వేల మంది దాకా వచ్చేవారు. రెండు నెలలు అయిన ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో పనులకు వచ్చే వారి సంఖ్య తగ్గుతోంది. వర్షాభావం కారణంగా వ్యవసాయ పనులు లేకపోవడం, పనులు చేసినా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో జీవనం కూడా కష్టసాధ్యంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, ఎండ కాలంలో ఎండకు ఎండాల్సిందే, వానకాలంలో వర్షాలకు తడవాల్సి వస్తోందని కూలీలు వాపోతున్నారు.. గతంలో పనులు చేసేందుకు కొంత అనుకూలంగా ఉన్నా చేసిన పనులకు బిల్లులు ఖాతాలలోకి జమకావడంలేదని వారు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ఇలాగే బిల్లు చెల్లించడం ఆలస్యమైతే అప్పులు కూడా పుట్టడం కష్టంగా మారుతుందంటున్నారు. పనులు చేసిన సకాలంలో బిల్లులు అందక పోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని, విధిలేని పరిస్థితులో పనులకు ఇతర పనులకు వెళ్లక తప్పడంలేదని కూలీలు అంటున్నారు.. బిల్లుల కోసం కార్యాలయం చుట్టు తిరగాల్సిన పరిస్థితి నెలకొందంటున్నారు. వెంటనే చెల్లించాలని వేడుకుంటున్నారు.

వ్యవసాయ పనులూ అంతంత మాత్రమే..

గతంలో ఎన్నడు లేని విధంగా వర్షాభావం నెలకొనడంతో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి.. మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు, పరిశ్రమలు లేక పోవడంతో కూలీలకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేవు. చాలా మంది కూలీలు ఉపాధి హామీ పథకం పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడం పంటలు దెబ్బతినడం సాగు విస్తీర్ణం తగ్గిపోవడం కారణంగా స్థానింగా గ్రామాలలో వ్యవసాయ పనులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయని అంటున్నారు.

ఆరు వారాల డబ్బు జమ కాలేదు



ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసిన సకాలంలో బిల్లులు రావడంలేదు. పనులు చేసి ఆరు వారాలు అవుతున్నా డబ్బులు ఖాతాలోకి జమకాలేదు. ఇంతకు మునుపు వారానికి రెండు వారాలకు బిల్లులు ఖాతాలోకి జమ చేసేవారు. ప్రస్తుతం ఆరు వారాలు అయినా బిల్లులు జమ కాలేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పనులు చేసే చోట వసతులు కల్పించడం లేదు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించాలి.

-కాంతరాజు, మల్లినమడుగు

రూ.78 కోట్ల దాకా బిల్లులు చెల్లించాలి

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు ఆరు వారాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి వుంది. జిల్లాకు సంబంధించి రూ.78 కోట్ల దాకా చెల్లించాలి. నిధులు విడుదల అయిన వెంటనే కూలీల ఖాతాల్లోకి జమ అవుతాయి.

- విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

అలరించిన సంగీత విభావరి



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హామీ పథకాల జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప తదితరులు

బళ్లారి సిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజ్‌కమార్ రోడ్డు వద్దనున్న సాంస్కృతిక సముదాయం నాడోజ సుభద్రమ్మ మన్సూర్ రంగమందిరంలో శనివారం రాత్రి షెడ్యూల్డ్ కుల ఉప ప్రణాళిక కింద కన్నడ సాంస్కృతిక శాఖ నిర్వహించిన 'హాడిరే రాగగళం-తూగిరే దీపగళ' సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. బళారికి చెందిన హులుగప్ప జానపదబృందం, సిరుగుప్పకు చెందిన అంబన్న దళవాయి సులభ సంగీతం, బళ్లారికి చెందిన జగదీశ్‌చే భావగీతాలు, సిరుగప్ప తాలూకా ఉత్తనూరుకు చెందిన రామప్పచే పాటలు, సంగనకల్లు ఉషచే వచన పాటలు, కిన్నారి జోగి సాహిత్యం హనుమంతప్ప జోగి, నీల గంగమ్మచే శోభానే పాటలతో సహా పలు సంగీత, గాత్రప్రదర్శనలు అలరించాయి. హామీపథకాల జిల్లా అధ్యక్షుడు చిదానందప్ప, కర్ణాటక చరిత్ర అకాడమీ అధ్యక్షుడు టి.హెచ్.ఎం బసవరాజు, నృత్యకళాకారిణి వీణ, కన్నడ సాంస్కృతిక శాఖ బి.నాగరాజు, మారెప్ప, రంగారెడ్డి, కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

7న కుడితిని భూబాధితుల పాదయాత్ర



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకుడు బసవరాజు

బళ్లారి సిటీ,ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీలు స్వాధీనం చేసుకున్న భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 7వ తేదీన కుడితిని భూ బాధితులు ఎమ్మెల్యే. ఎంపీల ఇంటికి పాదయాత్ర చేస్తున్నట్లు కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుడు బసవరాజ్ అన్నారు. ఆదివారం నగరంలోని పత్రిక భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కుడితినిలోని బ్రహ్మణి, లక్ష్మీ మిట్టల్, ఎన్ఎండీసీ కర్మాగారాల కోసం కుడితిని తాలూకాలోని ఆరు గ్రామాల రైతుల భూములు స్వాధీనం చేసుకున్నాయన్నారు. అయితే నేటికీ ఇందుకు సంబంధించిన పరిహారం ఇవ్వలేదన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రూ.లక్ష కోట్లు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వంతో చాలాసార్లు చర్చించామన్నారు. అయితే ఫలితం లేకుండా పోయిందన్నారు. 961 రోజులుగా నిరసన తెలుపుతున్నా పట్టించుకున్నవారు లేరన్నారు. కర్మాగారాలకు అవసరమైన 6 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేఐడీబీ అధికారులు తమ వద్దే ఉంచుచోవాలన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యబాబు, సంపత్, జంబన్న, జలీల్‌సాబు, తిప్పేస్వామి, భూ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

స్థలం విషయమై ఘర్షణ



ఘర్షణ పడుతున్న దృశ్యం

సోమందేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతగానిచెరువు గ్రామంలో సర్వేనంబరు 309-2డిలో ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తుల మధ్య స్థల వివాదం నెలకొంది. 18సెంట్ల స్థలంలో ముగ్గురికి ఆరు సెంట్లు చొప్పున భాగాలుండగా వీలునామాలో చిన్న తప్పిదంవల్ల ఇరు వర్గాలు వారం క్రితం ఘర్షణ పడ్డాయి. ఈ సంఘటనపై బాధితురాలు పార్వతమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘర్షణకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. శాసనకోట చిన్నతిమ్మయ్య, లక్ష్మీనరసప్ప బంధువులు. తిమ్మయ్య సంతానం వె oకటేశ్ మృతిచెందాడు. కోడలు పార్వతమ్మ ఆమె కుమారులు చంద్ర, ప్రవీణ్, మహేష్ తమ స్థలంలో ప్రహరీ, బాత్‌రూం నిర్మాణం చేపట్టగా లక్ష్మీనరసప్ప కుటుంబం అడ్డుకున్నట్లు తెలిసింది. దీంతో వారి మధ్య ఘర్షణ తలెత్తింది. ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఆన్-కాల్-డ్రైవర్‌గా పనిచేయడానికి అర్హులైన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలని డిపోమేనేజర్ ఇనయతుల్లా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 45 సంవత్సరాలలోపు ఉండి, హెవీ మోటార్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన 18 నెలల పైన బస్సు నడిపిన అనుభవం ఉన్నవారు అర్హులని అన్నారు. ఆర్టీఓ కార్యాలయం నుంచి క్లియరెన్స్ పొందిన ధ్రువపత్రం అందచేయాలని, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఒరిజినల్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకుని డిపోలో హాజరుకావాలని అన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

మడకశిర రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.అచ్చంపల్లికి చెందిన మహిళ రాధమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసు అపహరణకు గురైంది. ఆదివారం బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని బంధువు ఇంటిలో శనివారం రాత్రి జరిగిన శుభ కార్యక్రమం ముగించుకుని ఇంటిలోకి వచ్చి నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తన మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పరుగులు తీసినట్లు తెలిపారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

వాహనం కిందపడి చిన్నారి మృతి

యాడికి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బొలెరో వాహనం వెళ్లడంతో పద్మజ (2) అనే చిన్నారి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని లక్షుంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్షుంపల్లికి చెందిన శేఖర్, రమాదేవి దంపతులు వ్యవసాయం ద్వారా జీవనం పొందుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, రెండేళ్ల కుమార్తె పద్మజ ఉన్నారు. ఆదివారం వారి సొంత వ్యవసాయ పొలంలో టమోట పంట దిగుబడిని బొలెరో వాహనంలో తీసుకొని మార్కెట్‌కు వెళుతున్న సమయంలో ఇంటివద్దకు వెళ్లారు. తిరిగి టమోటాల విక్రయానికి ప్యాపిలికి బయలుదేరే సమయంలో చిన్నారి పద్మజ బొలెరో కింద ఉండడాన్ని గమనించకుండా డ్రైవర్ వాహనాన్ని ముందుకు పోనివ్వడంతో తీవ్రంగా గాయపడింది. చిన్నారిని చికిత్స నిమిత్తం రాయలచెరువుకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. పద్మజ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒత్తిళ్లు తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య

నార్పల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనీలో హర్ష(25) అనే యువకుడు ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే.. కాలనీకి చెందిన ఆదెప్ప కుమారుడు హర్ష అనంతపురంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. హర్ష కంపెనీ ఉద్యోగరీత్యా ఒత్తిళ్ల తట్టుకోలేక మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు.

హోసూరు జోన్

ధీరన్ చిన్నమలైకు నివాళి



నివాళులు అర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

హోసూరు (కృష్ణగిరి), ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలో కొంగునాడు నేషనల్ పీపుల్స్ పార్టీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ధీరన్ చిన్నమలైకు ఘనంగా నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్యకోసం పోరాడిన ధీరన్ చిన్నమలై 220వ వర్ధంతి సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీపై పాలెగార ధీరన్ చిన్నమలై పోరాటం చేసినట్టు గుర్తు చేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కొంగునాడు నేషనల్ పీపుల్స్ పార్టీ జిల్లా కోశాధికారి శివప్రకాశం, జిల్లా యువజన కార్యదర్శి కృష్ణన్, మాజీ ఒనేరియం వెల్లై రాజన్, కేంద్రకార్యదర్శులు సురేశ్, తిరుపతి, దేవా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా నవచండీయాగం



స్వామివార్లకు విశేష అలంకరణ

హోసూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హోసూరులోని చంద్రచూడేశ్వర కొండ ఆలయంలో మహానవచండీ యాగం మూడు రోజులపాటు భక్తిశ్రద్ధలతో సాగింది. గణపతి హోమం, తేరుపేట కల్యాణం, ఆలయం నుంచి నీటికుండలు, పాలకుండలతో కొండపై ఉన్న మరకతం బిగ్గె తల్లికి అభిషేకం చేశారు. కళశపూజ, సాయంత్రం యాగశాలలో విశేషపూజలు చేశారు. ఆదివారం కూడా ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. పూర్ణాహుతితో మహాచండీయాగం పూర్తయ్యింది. మూడురోజులూ అన్నదానం నిర్వహించారు.

అన్నాడీఎంకేలోకి పలువురి చేరిక




కార్యకర్తలతో కేపీ మునుసామి, మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని కరపల్లి గ్రామంలో ఏర్పాటైన కార్యక్రమంలో అన్నాడీఎంకే పార్టీలోకి 500మందికి పైగా కొత్త కార్యకర్తలు చేరారు. కృష్ణగిరి పశ్చిమ జిల్లా విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఆది సమక్షంలో చేరారు. ఏఐఏడీఎంకే ఉపప్రధాన కార్యదర్శి కేపీ మునుసామి, పశ్చిమజిల్లా కార్యదర్శి బాలకృష్ణారెడ్డి నూతన కార్యకర్తలను పార్టీ కండువాతో స్వాగతించారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ చైర్మన్ నారాయణన్, హోసూరు తూర్పు ఏరియా కార్యదర్శి రాజి, దక్షిణ ఏరియా కార్యదర్శి వాసుదేవన్, ఉత్తర ఏరియా అశోక్‌రెడ్డి, యూనియన్ కార్యదర్శి హరీశ్‌రెడ్డి, జగదీశ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

మాస్టర్ సీవీవీ (జయంతి)



మాస్టర్ కంచుపాటి వెంకటరావు వెంకటసామిరావు (సీవీవీ) 1868 ఆగస్టు 4న తమిళనాడు రాష్ట్రం కుంబకోణంలో జన్మించారు. తత్వవేత్త, యోగి, గురు. తొలుత కుంబకోణం మునిసిపల్ కౌన్సిల్ ఛైర్మన్‌గా వ్యవహరించి అనంతరం ఆధ్యాత్మికత వైపు మరలారు. 'భ్రుక్త రహిత తారకరాజయోగ' అనే సరికొత్త యోగాను ప్రవేశపెట్టారు. దీన్ని ఎలక్ట్రానిక్ యోగాగా వ్యవహరించారు. ఆయన బోధించిన యోగాపై పలు పుస్తకాలు వెలువడ్డాయి. 1922 మే 12న కన్నుమూశారు.

జంధ్యాల పాపయ్యశాస్త్రి (జయంతి)



ఇరవయ్యో శతాబ్దంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరైన జంధ్యాల పాపయ్యశాస్త్రి 1922 ఆగస్టు 4న గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించారు. సులభమైన శైలిలో, సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారముతో కవిత్వము ఉండడం ఆయన రచనల ప్రత్యేకత. కరుణశ్రీగా పేరొందారు. పుష్పవిలాపము, కుంతికుమారి కావ్యాలు ప్రసిద్ధి చెందాయి. మనుషులలో ఉత్తమ మార్పుకు, సమాజంలో శాంతికై రచనలు చేశారు. గౌరవ డాక్టరేట్, కవితా కళానిధి తదితర గౌరవాలు అందుకున్నారు. 1992 జూన్ 21న పరమపదించారు.

నూకల చిన్న సత్యనారాయణ (జయంతి)



కర్ణాటక సంగీతంలో బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ నూకల చిన్న సత్య నారాయణ 1923 ఆగస్టు 4న విశాఖపట్నం ప్రాంతం అనకాపల్లిలో జన్మించారు. పలువురు ప్రముఖ గురువుల వద్ద శిష్యరికంతో గాత్రంలోనూ, వయోలిన్‌లోనూ రాణించారు. లండన్ మేయర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాడారు. అమెరికా ఆహ్వానం మేరకు అక్కడ తన గళాన్ని వినిపించారు. పంచరత్న కీర్తనలను మోనోగ్రాఫ్ మీద వెలువరించారు. రాష్ట్రంలోని పలు సంగీత కళాశాలల్లో వివిధ స్థాయిల్లో పని చేశారు. కేంద్ర సంగీత నాటక పురస్కారాన్ని, మద్రాసు సంగీత పీఠంచే 'సంగీతాచార్యుడి'గా, ఆలిండియా రేడియోలో టాప్ ఆర్టిస్ట్‌లో ఒకరైన ఈయన సంగీత కళాఆచార్య, 'మహామహోపాధ్యాయ', పద్మభూషణ్ తదితర గౌరవాలు అందుకున్నారు. 2013 జూలై 11న కన్నుమూశారు.

మండలి వెంకట కృష్ణారావు (జయంతి)




మండలి వెంకట కృష్ణారావు 1926 ఆగస్టు 4న కృష్ణా జిల్లా కైకలూరు మండలం పల్లెవాడ గ్రామంలో జన్మించారు. 1972లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన శాసన సభ్యుడు, గాంధేయవాది. సాంస్కృతిక కళలు, విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. గాంధీ మార్గంలో సాగేవారు. 1977లో తుపాను సంభవించినప్పుడు ఆయన అందించిన సేవలకు 'దివిసీమ గాంధీ'గా పేరొందారు. తెలుగు దాత, తెలుగు వెలుగు, సూత్రధారి తదితర బిరుదులు పొందారు. 1997 సెప్టెంబరు 27న కన్నుమూశారు. కాగా కుమారుడిలో ఒకరైన మండలి బుద్ధ ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగి మంచిపేరు పొందారు.

కిషోర్‌కుమార్ (జయంతి)



దేశంలో ప్రముఖ నేపథ్య గాయకులలో ఒకరైన కిషోర్ కుమార్ 1929 ఆగస్టు 4న మధ్య ప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వాలో జన్మించారు. అసలు పేరు అభాస్ కుమార్ గంగూలి. హిందీ సినీ రంగంలో నటుడిగా, సంగీత దర్శకుడిగా, డైరెక్టర్‌గా రాణించారు. 'ట్రాజెడీ కింగ్'గా పేరొందారు. హిందీతో పాటు బెంగాలీ, మరాఠీ, అస్సామీ, గుజరాతీ, కన్నడ, బోజ్‌పురి, మలయాళం, ఉర్దూ భాషల చిత్రాలలో పాటలు పాడారు. అనేక ప్రైవేట్ ఆల్బమ్స్‌కు కూడా పాడారు. ఉత్తమ నేపథ్యగాయకుడిగా 8 ఫిలింఫేర్ పురస్కారాలు, ఇతర అవార్డులు అందుకున్నారు. 1987 అక్టోబరు 13న కన్నుమూశారు.

వేలూరు రామభద్రన్ (జయంతి)



'సంగీత కళానిధి' వేలూరు జీ రామభద్రన్ 1929 ఆగస్టు 4న సేలంలో జన్మించారు. మృదంగం మేస్త్రోగా రాణించారు. ఇతర కళాకారులతో కలసి సంగీత కచేరీలు ప్రదర్శించారు. హిందూస్తానీ సంగీతంలో సీనియర్, వర్ధమాన కళాకారులతోనూ పనిచేశారు. సంగీత చూడామణి, సంగీత నాటక అకాడమీ అవార్డు, సంగీత కళా శిఖామణి తదితర పురస్కారాలు అందుకున్నారు. 2012 ఫిబ్రవరి 27న కన్నుమూశారు.

బరాక్ ఒబామా (పుట్టినరోజు)



బరాక్ ఒబామా 1961 ఆగస్టు 4న హవాయిలో జన్మించారు. అమెరికా దేశ 44వ అధ్యక్షుడిగా 2009 నుంచి 2017వరకు కొనసాగారు. డెమోక్రటిక్ పార్టీలో కీలకంగా కొనసాగారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రజల మధ్య సత్సంబంధాలు కొనసాగించేలా కృషి చేసినందుకు '2009 నోబెల్ పీస్ ప్రైజ్' అందుకున్నారు. 'మోస్ట్ రెస్పెక్టెడ్ వరల్డ్ లీడర్'గా, మోస్ట్ పవర్‌ఫుల్ లీడర్‌గా చరిష్మా ఉంది. బెస్ట్ స్పోకెన్ వర్డ్ ఆల్బమ్ గ్రామీ అవార్డ్స్ అందుకున్నారు.

బాధ్యతాయుతమైనది పోలీసు వృత్తి

- మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన వృత్తి పోలీసు అని మంత్రి సవిత అన్నారు. నీతి నిజాయితీతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఇటీవల కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగం పొందిన నియోజకవర్గానికి చెందిన 25 మందికి మంత్రి సన్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. మీ తల్లిదండ్రుల కలలను నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగ రీత్యా మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

తల్లిపాల వారోత్సవాలపై జాగృతి

మహదేవపుర, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో భట్టరహళ్ళిలోని నమ్మ క్లినిక్‌లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలపై మహదేవపుర ప్రాంతీయ ఆరోగ్య అధికారి డాక్టర్ సవితా జాగృతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ శిశువు జన్మించినప్పటి నుంచి కనీసం ఆరు నెలలవరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. తర్వాత ఆహారం, నీరు ఇతర పదార్థాలు కొంచెంకొంచె ఇవ్వ వచ్చునన్నారు. తద్వారా శిశువు ఎదుగుదల సజావుగా ఉంటుందన్నారు. తల్లి పాలలో అధిక పౌష్టికాంశాలతోపాటు రోగనిరోధకశక్తి అంశం అధికంగా ఉంటుందన్నారు. కేఆర్‌పుర తాలూకా వైద్యాధికారి డాక్టర్ నిసర్గ మాట్లాడుతూ 'నమ్మ క్లినిక్‌లో లభించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రికి చెందిన లెవీనా పింటు, ఆరోగ్య సీనియర్ అధికారి గురురాజ్, శ్రీశైల కన్నాళ్, రాఘవేంద్ర, పార్మసీ అధికారి కవితాబాయి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న డాక్టర్ సవితా తదితరులు

నేడు చలో చిక్కబళ్లాపుర

బాగేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి డ్యాంకు మాజీ సీఎం ఎస్ఎం కృష్ణ పేరు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అందుకు బదులుగా మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి పేరు పెట్టాలని కోరుతూ సోమవారం చలో చిక్కబళ్ళాపుర పేరిట బైక్‌ర్యాలీ నిర్వహించనున్నారు. దశాబ్దాలక్రితం పోరాటాల ఫలితంగా బాగేపల్లి - గుడిబండ తాలూకాలలోని 128 గ్రామాలకు తాగునీటిని అందించడానికి బాగేపల్లి పట్టణంలో 62 రోజుల పోరాట ఫలితంగా కామ్రేడ్ జీవీ శ్రీరామరెడ్డి నేతృత్వంలో పోరాట ఫలితంగా చిత్రావతి డ్యాంకు సానుకూలమైంది. అప్పటి ముఖ్యమంత్రి జేహెచ్ పటేల్ ప్రభుత్వం రూ.8 కోట్లు కేటాయించగా ఎస్ఎస్ కృష్ణ ప్రభుత్వం భూమి పూజ చేశారు.

అప్పట్లో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసినా ఎమ్మెల్యే జీవీ శ్రీరామరెడ్డి పోరాటం చేసి డ్యాంను సాధించారు. డ్యాం పనులను పర్యవేక్షిం చారు. ప్రస్తుతం డ్యాంకు ఎస్ఎం కృష్ణ పేరు పెట్టడంపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. డ్యాంకు జీవీ శ్రీరామరెడ్డి పేరు పెట్టాలని కోరుతూ సోమ వారం చలో చిక్కబళ్ళాపుర బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. 40కిలోమీటర్ల మేర సుమారు వందమందికిపైగా ర్యాలీలో పాల్గొననున్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



చెక్కు అందజేస్తున్న దాత, కుటుంబీకులు

శిడ్లఘట్ట, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యోగినారేయణ యతీంద్ర నగర్‌లో కొలువైన వీరాంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి బెస్కాం రిటైర్డు అధికారి రామానిజం ఆయన కుటుంబసభ్యులు రూ.51,100 విరాళంగా ఇచ్చారు. చెక్కును ఆలయ కమిటీ అధ్యక్షుడు అనంతపద్మనాభంకు అందచేశారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. బలిజసేవా ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని కాక్స్‌టౌన్ భారతినగర్ రెసిడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో పేద, మధ్య తరగతి వర్గాల పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఆదివారం ఏర్పాటైన కార్యక్రమం నటి తార పాల్గొని అందచేశారు. ఫోరంనకు చెందిన సురేంద్రరవి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు తమవంతు చేయూత ఇస్తున్నట్టు తెలిపారు.



పుస్తకాలు అందజేస్తున్న నటి తార

బెస్కాం ఉద్యోగికి ఆత్మీయ వీడ్కోలు

శిడ్లఘట్ట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బెస్కాంలో 38 సంవత్సరాల సుదీర్ఘ సేవలందించి రిటైరైన సీనియర్ మెకానిస్ట్ మహబూబ్‌పాషాకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. పట్టణంలోని బెస్కాం కార్యాలయంలో సహ ఉద్యోగులు, సిబ్బంది పాషా దంపతులను సత్కరించారు. టౌన్ విభాగం సహాయక ఈఈ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ శాఖలో 38 సంవత్సరాలపాటు మహబూబ్‌పాషా వ్యవహరించారన్నారు. ప్రజలతోనూ, వినియోగదారులతో ఉత్తమ సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. విధి నిర్వహణలోనూ నిబద్ధతగా వ్యవహరించారన్నారు. బాబు అని అందరూ ఆత్మీయంగా పిలుస్తారన్నారు. ఈ సందర్భంగా రూరల్ విభాగం సహాయక ఈఈ ప్రభు, సహాయక ఇంజనీర్‌లు చంద్రశేఖర్, వేదకిరణ్, అనంతగౌడ, దిబ్బూరహళ్ళి విభాగం సహాయక ఇంజనీర్ మునిరాజు, లైన్‌మ్యాన్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌పాషా దంపతులకు సత్కారం



విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

గణపయ్యలు వచ్చేశారు..

పెనుకొండ రూరల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ సమీపిస్తుండటంతో విగ్రహాల విక్రయాలు ఊపందుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో ఇప్పటికే తయారు చేసిన భారీ వినాయక విగ్రహాలను విక్రయించేందుకు ఉంచారు. భారీస్థాయిలో ఉన్న వినాయక విగ్రహాలను వ్యాపారులు ఇప్పటికే మండలవ్యాప్తంగా ఉంచారు.

అరకొరగా పంటల సాగు

నేలరాలని చినుకు

ప్రత్యామ్నాయం వైపు చూపు

చిలమత్తూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. వరుణదేవుడు కరుణించకపోవడంతో పంట పొలాలు బీళ్లుగానే ఉండిపోయాయి. జూన్, జూలై మాసాలు పూర్తీ అయినా విత్తనాలు విత్తుకునేందుకు అవసరమైన వర్షపాతం నమోదుకాకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. మండలంలో వ్యవసాయశాఖ అధికారుల లెక్కల మేరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో అతి తక్కువగా పంట సాగు నమోదైంది. ప్రధాన పంటలుగా ఉన్న వేరుశనగ, మొక్కజొన్న పంటలు సగానికి సగం కూడా సాగవకపోవడం విశేషం. అధికారుల అంచనా ప్రకారం ఈ ఖరీఫ్‌లో వేరుశనగ 450 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 230 హెక్టార్లు మాత్రమే సాగైంది. మొక్కజొన్న విషయానికి వస్తే 2209 హెక్టార్లు సాగవ్వాల్సి ఉండగా కేవలం 421 హెక్టార్లు, కంది 163 హెక్టార్లకుగాను 14 హెక్టార్లు, వరి 75 హెక్టార్లు సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎక్కడా సాగు కాలేదు. రాగి 20 ఎకరాల వరకు సాగవ్వాల్సి ఉండగా కేవలం 6 హెక్టార్లు మాత్రమే సాగైంది. ఉలవ 25 ఎకరాలకు గాను ఒక ఎకరం సాగైంది. అయితే వర్షాలు లేకపోవడంతో బోరు బావుల ఆధారంగా మాత్రమే అక్కడక్కడ అరకొరగా ఈ పంటల సాగు జరుగుతోంది.

అతి తక్కువ వర్షపాతం

ఖరీఫ్‌లో పంటల సాగుకు అవసరమైన వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఊహించని విధంగా కనిష్ఠ స్థాయిలో నమోదైంది. రుతుపవనాల ప్రభావం లేకపోవడంతో కేవలం ఈదురుగాలులు, కారుమబ్బులు దోబూచి లాడి రైతులను నట్టేట ముంచేశాయి. మే 15వ తేదీ తరువాత ఓ మోస్తారుగా వర్షపాతం నమోదైంది. అయితే జూన్ ప్రారంభంలో ఆశాజనకంగా వానలు కురిసినా రెండో వారంలో ఆగిపోయాయి. దీంతో జూన్, జూలై నెలల్లో పంటలు విత్తుకునేందుకు 101.18 మీ.మీ వర్షపాతం అవసరం. అయితే కేవలం 71.84 మి.మీలు కురిసింది. అది కూడా అరకొరగా కురవడంతో విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం లేకుండా పోయింది.



విత్తుకు సిద్ధం చేసుకున్న పొలం

ముందుగానే సాగుకు సమాయత్తం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలో మేలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. వెంటనే పొలాలను ముందస్తుగా చదును చేసుకొని సాగుకు సమాయత్తమయ్యారు. జూన్ ప్రారంభంలోనే పంటలను విత్తుకోవాలని పొలాలను సిద్ధం చేసుకున్నారు. అయితే జూన్ వర్షాలు పడలేదు. దీంతో రైతులు విత్తనాలను విత్తుకోలేకపోయారు. చివరికి జూలైలో విత్తుకుందామని అనుకున్నారు. ఆ నెలలో కూడా వరుణ దేవుడు మొహం చాటేశాడు. రైతుల్లో తీవ్ర నిరాశ అలుముకుంది. విత్తనాలు, దుక్కి చేసుకోవడం వంటి వాటికి పెట్టుబడి పెట్టి ఆకాశం వైపు చూడాల్సి వచ్చింది.

ప్రత్యామ్నాయం వైపు చూపు

ఖరీఫ్‌లో జూన్, జూలై నెలల్లో వర్షం మొండికేయడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆలోచిస్తున్నారు. ఇప్పటికే వేరుశనగ, మొక్కజొన్న పంటల సాగుకు గడువు తీరిపోవడంతో ఇతర పంటల సాగుకు ఆశక్తి చూపుతున్నారు. అయితే ఇప్పటికైనా వర్షం కురుస్తేనే ఉలవ, ఇతరత్ర పంటలననైనా సాగుచేసుకునే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. అయితే ఆగస్టులోనైనా వరుణ దేవుడు కరుణిస్తాడో లేదో చూడాలి.

తీవ్ర కరువు వచ్చేలా ఉంది..



ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఆ పదునుతో పొలాలు దుక్కి చేసుకున్నాం. విత్తనాలు విత్తేందుకు సిద్ధం చేసుకున్నాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు చినుకు పడలేదు. ఇప్పటికే వర్షాకాలం సగం ముగిసింది. ఈ ఏడాది పంట సాగుకు అనుకూలించలేదు. తీవ్ర కరువు వచ్చేవిధంగా కనపడతోంది. బోరుబావుల్లో సైతం నీళ్ల అడుగంటుతున్నాయి. ఇప్పటికైనా వాన దేవుడు కరుణించాలి.

-రామిరెడ్డి, కోట్లోపల్లి రైతు

ఉలవ వేసుకోవచ్చు



వర్షాధారంగా వేరుశనగ, మొక్కజొన్న పంటలను విత్తుకునేందుకు సమయం ముగిసిపోయింది. ఇప్పటికైనా వర్షం వస్తే ప్రత్యామ్నాయ పంటలను విత్తుకోవ చ్చు. ఏ పంట వేసినా చేతికి అందే పరిస్థితి లేదు. ఒ క్క ఉలవ పంట వేసుకోవడానికి అవకాశం ఉంది. ప్ర త్యామ్నాయ పంటలను విత్తుకునేందుకు అధికారులు సలహాలు సూచనలు ఇవ్వాలి. ఉలవ పంట ఒక్కటే కొంత వరకు ఉపశమనం కలిగించే పంటగా ఉంది. దీనిని విత్తుకోవాలని అనుకుంటున్నాం. ఇతర పంటలు ఏమైనా ఉంటే అధికారులు తెలియజేస్తే బావుంటుంది.

-శీనా, రైతు, శానగానపల్లి



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ఘనంగా జ్యేష్టాదేవి శనైశ్చర కల్యాణోత్సవం

ముళబాగిలు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఖాద్రిపుర సర్కిల్‌లో గల శనైశ్చరస్వామి దేవా లయంలో జ్యేష్టాదేవి సమేత శనైశ్చరస్వామి వార్ల కల్యాణోత్సవం వందలాది భక్తులమధ్య సమక్షంలో ఘనంగా జరిగింది. మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం, తైలాభిషేకం, నవగ్రహ పూజ, రుద్రాభిషేకం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయాన్ని తోరణాలతో ముస్తాబు చేశారు. శరవణ, రాణి దంపతులు, వారి కుటుంబీకుల ప్రాయోజకత్వంలో కల్యాణోత్సవం కార్యక్రమం జరిగింది. ఆలయ సంస్థాపక అధ్యక్షుడు పీ సుదర్శన్ దీక్షిత్ నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ఉత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ

- తప్పిన ప్రమాదం



ఇంటిపై తెగిపడిన విద్యుత్ తీగ

సోమందేపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగొండ్రాయనపల్లి వద్ద ఎన్టీఆర్ కాలనీ గృహాలపై ఆదివారం 11కేవీ విద్యుత్‌లైను తెగిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు. కాలనీ మీదనుంచి వెళ్లిన విద్యుత్ తీగ ఒకసారిగా తెగిపడింది. అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. సమాచారాన్ని విద్యుత్‌శాఖ అధికారులకు చేరవేయడంతో వారు సకాలంలో స్పందించి సరఫరాను నిలిపివేసి మరమ్మతులు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆ ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం

- ఏఐఎస్ఎఫ్ నాయకులు



జీఓ ప్రతులను దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల ప్రవేశానికి నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం ప్రభుత్వం ఇచ్చిన పత్రాలను దగ్ధం చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులు హరించేలా పాఠశాలలో విద్యార్థి సంఘాలు ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను వెనక్కు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, హక్కుల కోసం విద్యార్థి సంఘాలు పోరాటం నిర్వహించడం దశాబ్దాలుగా వస్తోందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం విడ్డూరమన్నారు. జీఓ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, అలీ, వినిత్, ఖలందర్, ప్రభాకర్, దీపక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న టెంపో వాహనం

ఇద్దరికి తీవ్రగాయాలు

మడకశిర రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద నిలబడిన లారీని వేగంగా టెంపో ఢీకొని పక్కనే ఉన్న షాపులోకి దూసుకెళ్లింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే చొరవతో కార్మికులకు వేతనాలు



హర్షం వ్యక్తం చేస్తున్న నీటి కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

హిందూపురం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): హిందూపురానికి తాగునీటి పైప్ లైన్ గొల్లపల్లి వాటర్ వర్కర్స్ సమస్య పరిష్కారమైందని ఏఐటీయుసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ అన్నారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఆరు నెలల వేతనాలు వర్కర్స్‌కు అందాయని ఇందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవే కారణమన్నారు. వర్కర్స్ సమస్యను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారం అయిందన్నారు.